
# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

# కరెంట్ మాటెత్తితే... కాట్లె కలుపుడే..




## మూడు గంటలతో ఎవుసం ఎట్లా నడుస్తది



జగదేవ్‌పూర్, నవంబర్ 24: కాంగ్రెసోళ్లు ఎవుసానికి 3గంటల కరెంట్ ఇస్తే సరిపోతది అంటుర్రు. 3గంటల కరెంట్‌తో ఎవుసం ఎట్లా నడుస్తది. 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలు చూశాం. ఎపుడు కరెంట్ వస్తదో ఎపుడు పోతదో తెల్వక పోయేది. రాత్రి, పొద్దున, మధ్యాహ్నం అనే తేడా లేకుండా వచ్చే కరెంట్ కోసం రాత్రింబవళ్లు బాయిల కాడ పండేటోళ్లం. అయినా పంట చేతికందే సమయం వొచ్చే సరికి నీళ్లు అడుగంటుతుండే. కరెంట్ ఇయ్యకపోతుండే దీంతో పంటన్నీ ఎండిపోయిన రోజులు చూశాం. సీఎం కేసీఆర్ సారు వచ్చిన తర్వాత ఏడు గంటల కరెంట్‌ను 24గంటలు చేశాడుప. దీంతో పంటలు ఎండుడు తప్పింది. రాత్రి పూట బావులకాడికి పోయే పని తప్పింది. పదేండ్ల మంచి 24గంటల విద్యుత్ ఇస్తుండడంతో పంటలు మంచిగా పండుతున్నాయి. రైతులకు అండగా నిలిచి 24గంటల విద్యుత్ సరఫరా చేయిస్తున్న కేసీఆర్‌నే గెలిపించుకుంటాం.

*– భూమల్ల చిన్న అయిలయ్య, రైతు, జగదేవ్‌పూర్ మండలం*

## కాంగ్రెసోళ్లకు ఓటేస్తే ఇక వ్యవసాయం చేసినట్టే..



చేర్యాల, నవంబర్ 24: 10హెచ్‌పీ మోటర్లు పెట్టి ఇక వ్యవసాయం చేసినట్టే...రైతులు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకొని వ్యవసాయం చేయాలంటే లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుంది. చిన్న, సన్నకారు రైతులు ఎక్కడి నుంచి మోటర్లు కొనుక్కుంటారు. ప్రస్తుతం రైతులు 3,5హెచ్‌పీ మోటర్ల పెట్టుకొని వ్యవసాయం చేసుకుంటున్నారు. నీటి వసతిని బట్టి 2 నుంచి 5గంటల్లో ఎకరం పొలం పారించుకుంటున్నారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి వ్యవసాయం గురించి తెలిసినట్టు లేదు. 10వ తరగతి నుంచి వ్యవసాయం చేస్తున్నా, నాణ్యమైన విద్యుత్ ఇప్పుడు వస్తుండడంతో రైతులు సంబురంగా వ్యవసాయం చేసుకుంటున్నారు.రైతులను ఇబ్బందులు పెట్టే పార్టీలకు తెలంగాణలో చోటు లేదు.

*– ఆముదాల రఘుపతిరెడ్డి, యువ రైతు, చేర్యాల*

## కాంగ్రెసోళ్ల కరెంట్ ముచ్చట నమ్మం



వామ్మో కాంగ్రెసోళ్లు చెప్పే కరెంట్ ముచ్చట నమ్మం. ఏనిమిది, తొమ్మిదేండ్ల కిందట కరెంట్ లేక బాయికాడికి కూడా పోబుద్ధికాకపోయేది. తుట్ట.. తుట్ట... చిట్ట.. చిట్ట.. వచ్చుడు, పోవుడు కరెంట్ ఉంటుండే. కాంగ్రెసోళ్ల రోజుల్లో ఎవుసం కంటే కూలీ పనికి పోతేనే నయం అన్నట్లు ఉండేది. ఎందుకంటే బాయికాడ ఏం లేదు, ఇంటి కాడ ఉండి ఏం చేయాలే కూలీకి పోతేనన్న చిల్లర ఖర్చులు ఎల్లిపోయేది. బాయికాడికి పోతే ఎటు చూసినా ఎండినపొలాలు, అడుగుపట్టినసీళ్లు, కరెంట్ ఉండదు. ఇగేం చేయాలే అని దుఃఖం వచ్చేది. సప్పుడేక ఇ కరెంట్ పాడుగాను, ఇగ రాదు అని పొద్దువూకే దాక చూసి తిట్టుకుంటా ఇంటికి వచ్చేది. గట్లా ఉండేది కాంగ్రెసోళ్ల కరెంట్ తిప్పలు. ఇప్పుడేదో మళ్లీ బాయిలకాడ పెద్ద మోటర్లు పెట్టి, మూడు గంటల కరెంట్ చాలు అంటున్న కాంగ్రెసోళ్లకు ఎవుసం గురించి తెలువదు.

*– మిట్టపల్లి భద్రవ్వ, మహిళా రైతు, అక్కన్నపేట*

## 10హెచ్‌పీ మోటర్లు ఎవరూ వాడరు



గజ్వేల్, నవంబర్ 24: రైతులు ఇప్పుడైతే 3హెచ్‌పీ మోటర్లనే వాడుతుర్రు. 10హెచ్‌పీ మోటర్లను ఎవరూ వాడరు. ఇక్కడంతా 3హెచ్‌పీ మోటర్లవైపే రైతులు మొగ్గు చూపుతారు. 24గంటల కరెంట్‌తో రైతులు మంచిగా పంటలు పండించుకుం టున్నారు. గతంలో రాత్రి సమయంలో కరెంట్ ఎప్పుడు వస్తదో.. ఎప్పుడు పోతదో తెలియకపోతుండే. రైతులు పొలాల కాడా కరెంట్ కోసం చాలా ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడైతే బోర్లలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. దానికి తోడు కరెంట్ ఉంటుండడంతో రైతులకు బాధలు తప్పాయి. కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంటే ఇస్తే పంటలు పండించుకునేందుకు రైతులకు పాత రోజులొస్తాయి. సగం మంది రైతులు ఇబ్బందుల పాలవుతారు. అన్ని మంచిగానే చేస్తున్న కేసీఆర్ రైతులపై ఎక్కువే ప్రేమ చూపిస్తున్నాడు. కరెంట్ సమస్య మళ్లీ తీవ్రమైతే ఆగమైతం. కాంగ్రెస్ నాయకులు చెప్పే మాటలతో రైతులు పరేషాన్ అవుతున్నారు. కేసీఆర్ ఇస్తున్న 24గంటల కరెంటే ఉండాలే..అప్పుడే అందరూ బాగుపడతారు. *– మైలారం నర్సింహులు, రైతు, ధర్మారెడ్డిపల్లి, గజ్వేల్ మండలం*

## ఎవుసం చేసినోడికి రైతు గోస తెలుస్తది



ఎద్దు ఎవుసం లేని కాంగ్రెస్ నాయకులకు కరెంట్ కష్టాలు తెలియవు. మూడు గంట కరెంట్‌తో మూడు గుంటల భూమి పారదు.10హెచ్‌పీ మోటరు పెడితే వచ్చే కరెంట్ బిల్లు ఎవరు కడతాడు.ఉన్న మోటరు తీసేసి 10హెచ్‌పీ మోటరు పెడితే దానికి లక్ష ఖర్చవుతుంది. ఎవరు కొనిస్తారో కాంగ్రెస్ నాయకులే చెప్పాలి. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులు అరిగోస పడతారు. గతంలో రాత్రిపూట కరెంట్ ఇస్తే బోరుబావుల కాడికి వెళ్లేందుకు ఇబ్బందులు పడేది. 24 గంటల విద్యుత్ ఇచ్చే బీఆర్‌ఎస్‌నే గెలిపిస్తాం. నాకు రెండు ఎకరాల భూమి ఉంది. మరో ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగుచేస్తున్నా. అయినా వ్యవసాయం గురించి తెలిసి వాడే రాజు అయితే రైతులను బాగు చేస్తారు.

*–రెడ్డి బాల్‌రెడ్డి, రైతు, పెద్దకోడూరు*

## ఆ పార్టీ వద్దు.. ఆ కష్టాలు వద్దు



## కాంగ్రెస్ అధికారంలోకి వస్తే భూములు ఆగమే




తొగుట, నవంబర్ 24: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే భూములు ఆగమవుతాయి. భద్రత ఉండదు. కాంగ్రెస్ పాలనలో రైతులు గోస పడ్డారు. పట్టా పాస్‌పుస్తకాల కష్టాలు అంతా ఇంతా కావు. జమానా నుంచి పాత పాస్ బుక్‌లనే కొనసాగించారు. పొరపాటునా పాస్ బుక్ పోయిన వారు పడ్డ కష్టాలు చెప్పనవసరంలేకుండా ఉండేవి. అదనంగా డబ్బులు చెల్లించి డూప్లికేట్ పాస్ బుక్ పొందేవారు. దున్నిన వారికి పట్టా లేకపోయేది. పట్టా ఉన్న వారికి భూమి ఉండదు, కాగితాల్లో ఎక్కువ భూమి, కాస్తులో తక్కువ భూమి..ఇలా ఎన్నో భూసమస్యలు ఉండేవి. నేడు ఈసమస్యలను గుర్తించిన సీఎం కేసీఆర్ నూతన రెవెన్యూ చట్టం (ధరణి) తీసుకురావడంతో రైతుల కష్టాలకు తెరబడినట్లైంది. గతంలాగా నకిలీ పాస్‌బక్కులు తయారు చేయడానికి అవకాశం లేకుండా, నీళ్లలో పడినా కరాబు కాకుండా అందరికీ కొత్త పాస్ బుక్కులు అందజేశారు. ధరణి వల్ల తహసీల్ కార్యాలయంలోనే రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. మ్యుటేషన్ కూడా అదేరోజు కావడంతో రైతులకు కార్యాలయం చుట్టూ, అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పోయింది. దళారుల దందాకు చెక్ పడింది. మళ్లీ కాంగ్రెస్ వస్తే పటేలు, పట్వారీ వ్యవస్థ రావడం పక్కా. బీఆర్‌ఎస్‌కు, సీఎం కేసీఆర్ సారుకే అండగా ఉంటాం. *– బెస్త ప్రభుదాస్, రైతు, తొగుట మండలం*

- కరెంట్ కోసం వేడుకున్నా కనికరించలే..
- 'హస్తం'ను నమ్మి కష్టాలు కొనితెచ్చుకోలేం ..
- 24 గంటల ఉచిత విద్యుత్‌తో రంది లేకుండా ఉన్నం
- కాంగ్రెస్‌ను నమ్మమంటున్న రైతులు
- పటేల్, పట్వారీ వ్యవస్థలు మళ్లీ పుట్టుకొస్తయ్..
- పట్టా కావాలంటే డబ్బులు ముట్ట జెప్పాల్సిందే..
- మళ్లీ పాత పద్ధతిని తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ కుట్ర
- పీసీపీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై రైతుల ఆగ్రహం

## కాంగ్రెస్‌ను బొందపెడతాం

**కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు** కరెంటు కోసం ముప్పతిప్పలు పడ్డామని, ప్రత్యక్ష నరకం చూపించారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆహర్నిశలు కష్టపడి సాగు చేసిన పంటలు చేతికొచ్చే దశలో ఎండిపోయేవని, కరెంటో రామచంద్రా అని పాలకులను వేడుకున్నా కనికరించలేదని మండిపడుతున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ అందిస్తున్న 24 గంటల ఉచిత కరెంట్‌తో రంది లేకుండా పంటలు పండిస్తున్నామని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వారు చెబుతున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు 3 గంటలు కరెంట్ సరిపోతుందని, 10 హెచ్‌పీ మోటర్లు వినియోగించుకోవాలని ఉచిత సలహాలు ఇస్తున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో రైతులకు మాయమాటలు చెప్పి మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడుతున్నారు. ధరణిని బంగాళాఖాతంలో వేస్తామంటున్న కాంగ్రెస్ తీరుపై కర్షకలోకం భగ్గుమంటున్నది. మళ్లీ పటేల్, పట్వారీ వ్యవస్థ వస్తే రెవెన్యూ కార్యాలయాల చుట్టూప్రదక్షిణలు తప్పవంటున్నారు. పాత పద్ధతిని తీసుకొచ్చి దళారీ వ్యవస్థను ప్రోత్సహించేలా కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదని రైతులు మండిపడుతున్నారు.

*– సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, నవంబర్ 24*






## కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో కలపాలి



కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు కష్టాలు తప్పవు. సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ రైతులను ఎంత ఇబ్బందులు పెట్టిందో అందరికీ తెలుసు. ధరణిని వద్దంటున్న కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో కలిపినా తప్పు లేదు. ధరణి పోర్టల్‌తో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. భూ రికార్డులు భద్రంగా ఉంటున్నాయి. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ధరణితో భూమి హక్కుల పై దళారుల పెత్తనానికి చెక్‌పడింది. వీఆర్‌ఏలు, వీఆర్‌వోల లంచాల బాధ తప్పింది. రైతు వేలి ముద్రలు లేకుండా ఒకరి భూమి మరో వ్యక్తికి మార్చడం సాధ్యంకాదు. భూములు కొనాలన్నా, అమ్మాలన్నా ధరణి ద్వారా నిమిషాల్లో పని అవుతుంది. ధరణిని రద్దు చేస్తే రైతులకు సమస్యలు తప్పవు. మళ్లీ పాత రోజులు వస్తాయి.

*– కేసుగారి స్వామి, రైతు, దుబ్బాక టౌన్*

## ఎకరం పొలం పారదు

నారాయణరావుపేట, నవంబర్ 24: మూడు గంటల విద్యుత్‌తో ఎకరం పొలం పారదు. ఇప్పుడున్న ప్రభుత్వం రైతులకు 24 గంటలు కరెంట్ ఇస్తుంది. నాణ్యమైన 5 హెచ్‌పీ మోటర్లను వాడుతున్నాం కాంగ్రెస్ నాయకులు మూడు గంటల కరెంట్ ఇచ్చి 10 హెచ్‌పీ మోటర్లు పెట్టిస్తామని చెబుతున్నారు. రైతులందరూ 10 హెచ్‌పీ మోటర్లను బిగిస్తే ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు కాలిపోయే ప్రమాదం ఉంది. రైతులతో పాటు ఇండ్లల్లో కరెంట్ కష్టాలు మొదలవుతాయి. ఇప్పుడు తెలంగాణ సర్కారు రైతులకు 24 గంటలు కరెంట్ ఇస్తుండగా పంటలు మంచిగా పండుతున్నాయి. దిగుబడి కూడా అధికంగా వస్తుంది.

*– ఎల్కపల్లి బాలయ్య, రైతు, గోపులాపూర్, నారాయణరావుపేట మండలం*



## ధరణిని తీసేస్తే మళ్లీ పాత కథే



ధరణిని తీసేస్తే మళ్లీ పాత కథే మొదటికొస్తది. పట్టాల కోసం పట్వారీ, గిర్దావరి, తహసీల్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందే. కార్యాలయాల్లో కూడా అధికారులు రైతులకు అందుబాటులో ఉండరు. ఒకరి భూమి ఇంకొక్కరి పేరుమీద ఎక్కించి కిరికిరి పెట్టి పైసలు గుంజుతారు. ధరణి వచ్చిన తర్వాత ఇబ్బందులు తప్పాయి. అరగంటలోనే పట్టా మార్పిడి, జరిగి పట్టదారు పాసుపుస్తకంలోకి ఎక్కుతుంది. ఇంత మంచిగా ఉన్న ధరణిని తీసేస్తే రైతులకు ఇబ్బందులు తప్పవు. రెవెన్యూ రికార్డుల విషయంలో రైతులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ధరణిని తీసుకొచ్చారు. రైతులను ఆగం చేసేందుకే కాంగ్రెసోళ్లు ధరణిని తీసేస్తమని చెబుతుంర్డు.

*– గంపల కృష్ణారెడ్డి, రైతు,రేబర్తి, మద్దూరు మండలం*

## కాంగ్రెస్ వస్తే దళారులదే రాజ్యం



మర్కూక్, నవంబర్ 24: ధరణిని రద్దుచేస్తే దళారులదే రాజ్యం. అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పడం సరి కాదు. ధరణిని రద్దుచేస్తే దళారులకు మళ్లీ అవకాశం ఏర్పడుతుంది. కాంగ్రెస్ పాలనలో పహాణీ పద్ధతిలో వీఆర్వోల చేతివాటం ఉంటుంది. పూటకొకరి పేరున భూమి ఎక్కిస్తారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ప్రభుత్వ పాలనలో మధ్యవర్తుల పేరు తొలిగించి నేరుగా భూయజమానికి పూట్టాదారుగా అవకాశం ఇచ్చింది. రైతు వేలి ముద్రతోనే భూమి బదిలీ జరుగుతుంది. రిజిస్ట్రేషన్ కాగానే వెంటనే కొనుగోలుదారుడికి మ్యుటేషన్ పత్రం ఇస్తున్నారు. ఇలాంటి ధరణి రద్దైతే రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దు.. వారిని అధికారంలోకి రానీయొద్దు.

*–కొలుగూరి అంజిరెడ్డి, ఇప్పలగూడెం, మర్కూక్ మండలం*

## దళారులొస్తరు..



ధరణిని రద్దు చేస్తే మునపటి లెక్కనే మళ్లీ కార్యాలయాల్లో దళారులదే రాజ్యమైతది. ధరణి వచ్చిన తర్వాత భూములు రికార్డులు భద్రంగా ఉన్నాయి. ఇదివరకు పహాణీల్లో పట్వారీలు తమకు ఇష్టమొచ్చినట్లు పేర్లు మార్చేవాళ్లు. దీంతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వచ్చేది. ధరణి రాకముందు భూమి రిజిస్ట్రేషన్ ఒకచోట, మ్యుటేషన్ మరోచోట ఉండేది. ఇప్పుడా తిప్పలు తప్పాయి. ఇప్పుడు రిజిస్ట్రేషన్ కాగానే పట్టదారు పాసు పుస్తకంలోకి భూమి వివరాలు వెంటనే ఎక్కుతున్నాయి. గింతమంచి సౌలత్ ఉన్న ధరణిని తీసేస్తే మళ్లీ రైతులకు కష్టాలు వచ్చినట్లే. రైతులకు న్యాయం చేసేందుకు సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన ధరణిని కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఆగం చేయాలని చూస్తుంర్డు.

*–కొమిరె రామస్వామి, ఉప్పరోనిగడ్డ, మద్దూరు మండలం*




## ఇప్పుడు భూములు భద్రం



గజ్వేల్, నవంబర్ 24: కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో రైతుల భూములు పదిలంగా ఉన్నాయి. గతంలో రికార్డుల్లో భూములను తారుమారు చేసి ఎంతో మంది రైతుల ఉసురు తీశారు. పక్కాగా ఆన్‌లైన్‌లో పొందుపర్చడంతో రైతుల భూములకు భరోసా కలిగింది. అప్పుడైతే పలుకుబడి ఉన్న వారు రికార్డులను తారుమారు చేసి చిన్నకారు రైతులకు మోసం చేసిన సంఘటనలు ఉన్నాయి. కానీ ఇప్పుడైతే అలాంటి పరిస్థితి లేదు. రైతు నేరుగా తహసీల్ కార్యాలయంలో వేలుముద్ర పెడితేనే భూములు రిజిస్ట్రేషన్ అవుతున్నాయి. ధరణి వల్ల రైతుల భూములకు భద్రత కలిగింది. ధరణిని ఎత్తివేస్తే ఎనకటి కష్టాలు రైతులకు మళ్లీ తప్పవు. ధరణి వల్ల ప్రభుత్వం వేసే రైతుబంధు నేరుగా వారి ఖాతాలోనే పడుతుంది. ఇంత మంచి ధరణిని తీసేస్తమనడంతో రైతులు బాధపడుతుర్రు. ఎన్నో ఏండ్ల సమస్యకు ధరణితో మోక్షం లభించింది. గుంట భూమి ఉన్న ఆన్‌లైన్‌లో చూపిస్తున్నది. దీంతో అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేదు.

*– సుంకె సత్యనారాయణ, యువరైతు, బంగ్లావెంకటాపూర్, గజ్వేల్ మండలం*

## కాంగ్రెసోళ్లు ఆగం చేస్తుర్రు



ధరణిని తీసేస్తమని చెప్పి కాంగ్రెసోళ్లు రైతులను ఆగం చేస్తుర్రు. యాభై ఏండ్లుగా పాత పద్ధతి వల్ల భూ సమస్యలతో నానా తంటాలు పడ్డాం. భూమి కొని పట్టా అయ్యేదాకా హరిగోసం ఉండేది. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పాస్‌బుక్‌లు వచ్చేవి కావు. వివరాలు సక్రమంగా ఎక్కించేటోళ్లు కాదు. పాస్ బుక్‌లకు కూడా పైసలు తీసుకునేటోళ్లు. సీఎం కేసీఆర్ ధరణి తీసుకొచ్చిన తర్వాతనే రైతుల భూములకు భరోసా వచ్చింది. రిజిస్ట్రేషన్ కాగానే ఇంటికే పాస్‌బుక్‌లు వస్తున్నాయి. ఇట్లా ఇంటికే పాస్‌బుక్‌లు తెచ్చిచ్చింది ఎవరూ లేరు. ధరణిని తీసేస్తమని చెప్పే నాయకులు మాకొద్దు..వారిని మళ్లీ ఇంటికే పంపుతాం.

*– జంబుల రాజిరెడ్డి, రైతు, జగదేవ్‌పూర్ మండలం*